క్లుప్తంగా

గ్రానైట్ తీసేందుకు మా పొలాలు ఇవ్వం


గ్రామసభ నిర్వహిస్తున్న వీఆర్‌ఓ బ్రహ్మయ్య

పీసీపల్లి: గ్రానైట్ తీసేందుకు మా పొలాలు ఇవ్వమని మార్లెళ్ల గ్రామ ప్రజలు మూకుమ్మడిగా తీర్మానం చేశారు. ఎల్ఎల్‌పీ మైనింగ్ కంపెనీ గ్రామ సర్వే నంబర్ 195లో 11.26 ఎకరాల్లో మైనింగ్ చేసేందుకు దరఖాస్తు చేయగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మా పొలాల్లో పంటలు వేశామని మా పొలాలు గ్రానైట్‌కి, మైనింగ్‌కి ఇవ్వమని సర్పంచ్ వెంకట్రావు, గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వీఆర్‌ఓ బ్రహ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం శనివారానికి వాయిదా పడినట్లు ఎంపీడీవో డీ జయమణి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక మధ్యాహ్నానికి వాయిదా పడింది. మధ్యాహ్నం తరువాత కూడా సభ్యులు, అధికారులు రాకపోవటంతో చివరికి ఎంపీపీ కట్టా శోభారాణి అనుమతితో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు కూడా అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వమన్నా కూటమి ప్రభుత్వ నాయకుల అనుమతి లేకుండా ఇచ్చేది లేదని అధికారులు చెప్తున్నారని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులయిన ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఈ ప్రభుత్వంలో మాకు రావాల్సిన గౌరవ వేతనం కూడా ఇవ్వలేదని ఎంపీటీసీ సభ్యులు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరిరూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈనెల 11వ తేదీ శనివారం కనిగిరి పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు కరెంట్ నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. కావున వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కొండపి సబ్‌స్టేషన్ పరిధిలో..

కొండపి: కొండపి మండలంలోని మూడు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ పువ్వాడి శుక్రవారం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతులు నిర్వహిస్తున్నామని, అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు.రైతులు, గ్రామ ప్రజలు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్సై కె.మాధవరావు అన్నారు. శుక్రవారం వేములపాడు, కనిగిరి రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఇతర పత్రాలు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. హెల్మెంట్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సూచలిచ్చారు.

ఉపాధ్యాయుల ఖాళీలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల కారణంగా మండల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీ సాంబశివరాలు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్.పాదుషాలు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 36 సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం మూడు ఖాళీలనే చూపించారన్నారు. అదేవిధంగా నల్లమడుగుల, పెదరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, పెదగోగులపల్లి యూపీ పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పోస్టులను డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకు చూపించలేదన్నారు. మండలంలో 7 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం రెండు మాత్రమే చూపించారన్నారు. వెనుకబడిన సీఎస్‌పురం మండలానికి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 10 మంది సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీ కోరుకున్నప్పటికీ రిలీవర్ లేక వారు కోరుకున్న పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే సీఎస్‌పురం మండలానికి ఉపాధ్యాయులను కేటాయించి సమస్య పరిష్కరించాలన్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం


అంగన్‌వాడీ భవనంలో ఉన్న పశువులు

అసంపూర్తి పనులు.. తొలగని ఇబ్బందులు !

- అసంపూర్తిగా నిలిచిన శ్రీరంగరాజపురం అంగన్‌వాడీ భవనం
- పశువుల పాకగా మారిన భవనం
- పట్టించుకోని అధికారులు

కందుకూరు రూరల్:

కూటమి ప్రభుత్వం, అధికారుల అలసత్వం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనంలో కొందరు పశువుల పాకగా ఉపయోగిస్తున్నారు. అందులో ఆవులు కట్టేసి మేత కూడా ఆ భవనంలో వేస్తున్నారు. 2017లో నిర్మాణం చేపట్టిన ఈ భవనం నిధుల కొరతలో నిలిచిపోయింది. శ్లాబు వేసి, గోడలు కూడా నిర్మించారు. ఇక కేవలం ప్లాస్టరింగ్ చేసి, డోర్లు, కిటికీలు, ఎలక్ట్రికల్ పనులు మాత్రమే ఉన్నాయి. అప్పటి నుంచి ఆ భవనాన్ని పట్టించుకోకపోవడంతో అలాగే నిలిచిపోయింది. అప్పటి నుంచి ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం ముందుకు సాగలేదు. ప్రభుత్వ భవనంలో పశువులు కట్టేస్తున్నప్పటికి ఐసీడీఎస్ అధికారులుగాని, పంచాయతీ అధికారులు గాని పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ భవనం అపరిశుభ్రంగా మారింది.


అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అంగన్‌వాడీకి దూరమవుతున్న చిన్నారులు..

అంగన్‌వాడీ కేంద్రం మాత్రం అద్దె భవనంలో నడుస్తోంది. అరకొర వసతులతో అద్దె భవనంలో నడుపుతున్నారు. కేంద్రంలోని ఏడుగురు చిన్నారులు ఉన్నట్లుగా రికార్డులు ఉన్నాయి. కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాల్సి ఉంది. కానీ అద్దె భవనంలో అలాంటి వాతావరణం కనిపించడం లేదు. అద్దె భవనం ముందు పిల్లలు ఆడుకునేందుకు ఖాళీ స్థలం కూడా లేదు. వర్షం పడి భవనం ముందు బురదగా మారుతోంది. దీని కారణంగా కూడా అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టం చూపించడం లేదు. అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదే విధంగా భవనంలో పశువులను కట్టేయకుండా చూడాలని, దీని వల్ల భవనం అపరిశుభ్రంగా తయారవడంతోపాటు పశువులు గోడలను రుద్దేసే అవకాశం కూడా ఉంది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ప్రభావతిని వివరణ కోరగా అప్పటల్లో నిధులు కొరతతో భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. తిరిగి భవనాన్ని పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి ఉన్నామని తెలిపారు.

వైద్యవిద్య ప్రైవేటుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు

- కోటి సంతకాల ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల, పార్టీ శ్రేణులు

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఏకపక్ష నిర్ణయాలతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటుందని.. దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేద్దామని వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి సర్కార్ కుట్రలు చేస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా, ఉన్నత లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారన్నారు. అందులో మెడికల్ 7 కళాశాలలు పూర్తికాగా, 10 కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 16 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.


పోస్టర్ ఆవిష్కరణలో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

ఉద్యమాలు ఉధృతం చేస్తాం..

కూటమి సర్కార్ దుష్ట చర్యలను నిరసస్తూ సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 10 నుంచి 22వ తేదీ వరకు గ్రామ, వార్డుల్లో రచ్చబండ, సంతకాల సేకరణ, 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు, 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలింపు, గవర్నర్‌కు నివేదన, కోటి సంతకాల పత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత దద్దాల, పార్టీ నేతలతో కలిసి మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ‘వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం’ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, ఆవుల భాస్కర్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్‌కే రసూల్, సూరసాని మోహన్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, తమ్మినేని సుజాత, పార్టీ మండల అధ్యక్షులు జీ బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, పోలక సిద్దారెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, గూడూరి అబ్రహం లింకన్, చింతం గుంట్ల కిషోర్, రామనబోయిన శ్రీను, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, గాలి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు దరిశి సుబ్రహ్మణ్యం, వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, దరిశి ఫణీ, పలుకూరి భాస్కర్, మండ్లా సాయి, తమ్మినేని ఉమాశంకర్, పాతిరెడ్డి రమణారెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి, వంకదారి రాజా, మూలే మాలకొండారెడ్డి, పాపబత్తుని నాగేశ్వరరావు, మల్లెల యాకొబు, అత్యాల ఇసాక్, భూమిరెడ్డి కొండారెడ్డి, ముద్దా బాబు, దమ్ము వెంకటయ్య, ఏటీఆర్, కసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, ఎస్‌కే ఖాజా హుస్సేన్, ఎస్‌కే ఖాదర్ జీలాని, యాళ్ల కృష్ణారెడ్డి, పరుచూరి రమేష్, పాదిలి చెన్న కేశవులు, పాతకొట్టు రాము తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ. 244

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం పొగాకు సరాసరి ధర కేజీ రూ. 244.90కు పడిపోయింది. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1080 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 876 కొనుగోలు జరగగా, 204 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 315 కాగా, కనిష్ట ధర రూ. 70 పలకగా, సరాసరి రూ. 244. 90 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

ముగిసిన 13వ రౌండ్ పొగాకు వేలం..

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారంతో 13వ రౌండ్ పొగాకు వేలం ముగిసిందని వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని వెన్నూరు, చిన్న వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1178 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 840 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 338 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 315, కనిష్ట ధర కేజీ రూ 70, సరాసరి ధర కేజీ రూ 216.68గా నడైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడు పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో కృష్ణారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని పోషకాలు అందేలా ఆహారం రుచికరంగా వండి పెట్టాలన్నారు. అదేవిధంగా మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం గ్రామంలో తాగునీరు సరఫరా అయ్యే బావులు, డీప్ బోర్లను పరిశీలించారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి

కొండపి: పొగాకు రైతులు సాగు విస్తీర్ణం కొంతమేర తగ్గించుకొని ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రీజనల్ మేనేజర్ ఎస్. రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక పొగాకు బోర్డులో పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు పంటల మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులు పొగాకును సాగు చేయాలన్నారు. దర్శి వ్యవసాయ శాస్త్రవేత్త టీ వెంకటేశ్వర రెడ్డి ప్రత్యామ్నాయ పంటలైన మిరప, శనగ, మినుము, పెసర, మొక్కజొన్న పంటలు వాటి వంగడాలు, విత్తన శుద్ధి, ప్రాముఖ్యత దిగుబడుల గురించి రైతులకు వివరించారు. వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ మాట్లాడుతూ అధిక విస్తీర్ణంలో ఎఫ్‌సీవీ పొగాకు పంటను సాగు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు వివిధ గ్రామాల రైతులు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు

అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

కనిగిరిరూరల్: ఈనెల 13,14,15 తేదిల్లో అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకురాలు ఎస్‌కే షమీలా అన్నారు. మహాసభలను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని సుందరయ్య కాలనీలో జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్‌కే షమీలా మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దాడులు అరికట్టేందుకు, మద్య నిషేదం అమలుకు, సమాజంలో మార్పు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్తమ్మ, ఆదిలక్ష్మీ, మల్లేశ్వరి, కృపమ్మ, లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో ఐద్వా నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు సింగరాయకొండ విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ: రాష్ట్రస్థాయి పోటీలకు సింగరాయకొండ విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రకాశం జిల్లా జట్టుకు పాత సింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఎంపికైనట్లు హెచ్ఎం సీహెచ్ పద్మజ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించి ఆమె మాట్లాడారు. ఒంగోలులో గురువారం జరిగిన పోటీల్లో ఏ వర్షిణి, డీ అక్షర, బీ హరిప్రియ, ఎం చరణ్, పీ హర్షవర్ధన్, సీహెచ్ చరణ్‌లు ఎంపికయ్యారన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు పి శ్రీనివాసరావు, ఎండీ అన్వర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమ మైనింగ్ లారీ స్వాధీనం

పీసీపల్లి: అడవిలో అక్రమంగా మైనింగ్ తీస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల మేరకు.. మండల పరిధిలోని మురుగమ్మి అడవిలో అక్రమంగా మైనింగ్ తీస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దానిలో భాగంగా శుక్రవారం లారీని ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకొని పీసీపల్లి పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

పశువుల బీడును ఫలహారంగా పంచుతారా ?

- రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ వాకా

మద్దిపూడి: పశువుల బీడును ఫలహారంగా పంచుతారా ? అని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి రెవెన్యూ అధికారులపై మండి పడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండ్లసముద్రం గ్రామంలోని సర్వే నంబరు 571లో 207.86 ఎకరాల్లో ఉన్న పశువుల బీడు ఆక్రమణ గురించి గ్రామస్తులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారని, వెంటనే పరిశీలించి ఆన్‌లైన్‌లో నుంచి పేర్లు తొలగించాలని అధికారులను సైతం ఆదేశించారు. అయినప్పటికీ నేటిని ఆక్రమణదారుల పేర్లను ఎందుకు వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించలేదని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువైద్యశాలలో వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దిపూడి పంచాయతీ ప్రజలకు గత 5 రోజులుగా తాగునీరు అందడంలేదని గ్రామస్తులు సభదృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం వల్లా నీరు ఇవ్వలేకపోతున్నామని, మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ జైపాల్ తెలిపారు. వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు పడనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25లోగా ఈ క్రాప్ బుక్ చేసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ సుబ్బారెడ్డి మాట్లాతూ మండలంలో రూ.10 లక్షలు పెండింగ్ బిల్లులు ఉన్నాయని చెల్లించాలన్నారు. మండలంలో 54 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 14 కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవని సీడీపీఓ సుశీల దేవి తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఏఈ నవీన్, ఎంపీడీఓ జగదీష్, డిప్యూటీ తహశిల్దార్ నాగరాజు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఏఈ జైపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

అనుమానాస్పద వ్యక్తులు, పార్శిళ్లతో జాగ్రత్త


జాగిలంతో తనిఖీలు చేపడుతున్న డాగ్‌స్క్వాడ్

పామూరు/కనిగిరిరూరల్: : మీ పరిసర ప్రాంతాల్లో కనిపించే అనుమానాస్పద వ్యక్తులు, పార్శిళ్లతో జాగ్రత్తగా ఉండాలని కనిగిరి, పామూరు సీఐలు ఎస్‌కే ఖాజావలి, ఎం భీమానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కనిగిరి, పామూరులోని కొరియర్ సర్వీస్ కేంద్రాలు, టాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించమన్నారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, కొరియర్, ట్రాన్స్‌పోర్ట్, పార్శిల్స్, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రదేశాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని గంజాయి వ్యాపారుల, అనుమానితుల ఇళ్లల్లో పోలీసులు విస్తృత సోదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు టి.కిషోర్‌బాబు, టీ శ్రీరాం, డాగ్ హ్యాండ్లర్ విద్యాసాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు వైద్యం చేస్తే కఠిన చర్యలు


ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

కొండపి: ఆర్ఎంపీలు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి టీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల ఒక ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మతి చెందిన నేపథ్యంలో శుక్రవారం ఆయన కొండపిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, తదుపరి వైద్యం నిమిత్తం సర్టిఫైడ్ డాక్టర్లకు రిఫర్ చేయాలన్నారు. అలా కాకుండా సెలైన్లు కడుతూ ఇంజక్షన్లు చేస్తూ వైద్యం చేసే వారిపై పోలీసు సహకారంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల క్రితం జరిగిన ఘటన నేపథ్యంలో ఆ క్లినిక్‌లను పరిశీలించబోయేసరికి ఆర్ఎంపీలు తాళాలు వేసుకొని వెళ్లారు. వెంటనే డీఎంహెచ్‌వో ఆ ఇంటి యజమానులతో మాట్లాడారు. కాలం చెల్లిన మందులు స్టెరాయిడ్స్ వాడిన ఆర్ఎంపీ మీద డ్రగ్స్ అండ్ కంట్రోలర్ యాక్ట్ ద్వారా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌కు చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అనంతరం కొండపిలోని సీహెచ్‌సీని పరిశీలించి రోగుల వివరాలను అందిస్తున్న సేవలను సూపరింటెంటెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వాణిశ్రీ, సూపరిండెంటెంట్ కుంబా నాగమణి, వైద్య సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


ఎమ్మార్సీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎంఈవో కార్యాయంలో శుక్రవారం సిబ్బందికి ఉపాధ్యాయులు మెమొరాండం అందజేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు వి.సాంబశివరాలు, షేక్.నాయబ్‌రసూల్ మాట్లాడుతూ మండల ఫ్యాప్టో ఆధ్వర్యంలో, మండల ఫ్యాప్టో కమిటీ తరపున బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. విద్యారంగంలో మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకున దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనందర్‌బాబు, ఎస్.వెంకటరామయ్య పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కొండపి: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సోమశేఖర్ అన్నారు. మండలంలోని చిన్నకండ్లగుంట గ్రామ సమీపంలో ఉన్న బాణసంచా గోడౌన్‌ను ఎస్సై బీ ప్రేమ్‌కుమార్ తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా వ్యాపారులు అన్ని అనుమతులు తీసుకొని బాణసంచాలు విక్రయించాలన్నారు. గోడౌన్ లోని స్టాక్ వివరాలను పరిశీలించి వ్యాపారులకు సూచనలు చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండపి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిపై పిడుగుపాటు


ధ్వంసమైన ఇంటి పైన ఉన్న గోడ

టంగుటూరు: పిడుగుపాటుకు ఇంట్లోని విద్యుత్ పరికరాలు ధ్వంసమయ్యాయి. ఈఘటన మండలంలోని ఆలకూరపాడు ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న లక్కంతోటి సుబ్బారావు ఇంటిపై ఉన్న చిన్న రూముపై పిడుగు పడగా పైన ఉన్న గోడ ధ్వంసమైంది. దీంతో ఫ్యాను, ఫ్రిజ్, తదితర వస్తువులు కాలిపోయాయి. రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. పిడుగు పడిన సమయంలో కింద ఇంట్లో సుబ్బారావు కొడుకు బ్రహ్మానందం, కోడలు సౌమ్య, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. పిడుగు పడిన సమయంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వీఆర్వో నరసింహం పిడుగుపడిన పరిసరాలను పరిశీలించారు.

